సాక్షి
పల్నాడు

సోమవారం । 26 । జూన్ । 2023



అమ్మకు 'దండ'ం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠం రాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం నిమ్మకాయల దండతో అలంకరించారు.



సూర్యోపాసన

విజయవాడ : లోక సంరక్షణార్థం ఆదివారం కనకదుర్గమ్మ సన్నిధిలో సూర్యభగవానుడి చిత్రపటం వద్ద సూర్యోపాసన సేవ చేశారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

మల్లేశ్వరుని సేవలో సుమన్



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం సినీ నటుడు సుమన్ సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేక పూజల్లో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఎల్.శివ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొనాల్సి ఉన్న నేపథ్యంలో స్పందనను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కొండవీడు భళా
గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



యడ్లపాడు: కొండవీడు కోటను గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. పురాతన కట్టడాలు, అభివృద్ధి పనులను తిలకించారు. అద్దంకి రెడ్డిరాజులు నిర్మించిన వెదుళ్ల, ముత్యాలమ్మ, పుట్టాలమ్మ చెరువులతోపాటు వ్యూ పాయింట్లను సందర్శించి సెల్ఫీలు దిగారు. కొండవీడు ప్రాశస్త్యాన్ని కొండవీటి కోట అభివృద్ధి కన్వీనర్ కల్లి శివారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొండవీడును సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శన శాలను కలెక్టర్ సందర్శించారు.

28 నుంచి పల్నాడు రైల్వే స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్



నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి స్టేషన్లలో పలు రైళ్ల హాల్ట్‌ని పునరుద్ధరిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం వెల్లడించారు. రైల్వేమంత్రి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రైళ్లు ఆయా స్టేషన్లలో ఆపకపోవటం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గతంలో అనేక మార్లు రైల్వే మంత్రి, అధికారులకు విన్నవించినట్లు శ్రీకృష్ణదేవరాయలు వివరించారు. ఈ అభ్యర్థనల ఫలితంగా రైల్వేశాఖ పలు రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్లలో తిరుపతి -లింగంపల్లి నారాయణాద్రి ఎక్స్ ప్రెస్ (12733), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-హైదరాబాద్ చెన్నై ఎక్స్‌ప్రెస్(12603) రైళ్లకు ఈనెల 28 నుంచి, నాగర్‌సోల్-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (17232)కు జూలై ఒకటి నుంచి హాల్ట్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 519.90 అడుగుల వద్ద ఉంది. ఇది 149.0933 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.60 అడుగుల వద్ద ఉంది. ఇది 33.5302 టీఎంసీలకు సమానం.

దుర్గమ్మ సన్నిధిలో మహిళా ఐపీఎస్‌లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం పలువురు మహిళా ఐపీఎస్‌లు దర్శించుకున్నారు. భీమవరం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఐపీఎస్ కె.హైమావతి అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఈవో భ్రమరాంబ వారికి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వంచన యాత్ర

- భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో పల్నాడులో నేటి నుంచి బస్సు యాత్ర
- ఐదు నియోజకవర్గాల్లో ఐదురోజులపాటు డ్రామా షో
- గతంలో బూటకపు హామీలిచ్చి దగా చేసిన చంద్రబాబు
- వరికపూడిశెల, రైతు రుణమాఫీ పేరుతో నిండా ముంచిన వైనం
- మళ్లీ మోసం చేసేందుకు కుటిల యత్నాలు
- నిన్ను నమ్మం బాబూ అంటున్న ప్రజలు

సాక్షి, నరసరావుపేట: చిత్తశుద్ధిలేని హామీలతో ప్రజలను బుట్టలో వేసుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత వంచించడంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సిద్ధహస్తులు. ఆయన ఏ మాట చెప్పినా అది రాజకీయ లబ్ధి కోసమే తప్ప ఆచరణలోకి తీసుకురారనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఎన్నికల ఏడాది కావడంతో మరోసారి ప్రజలను వంచించేందుకు కొత్త హామీలతో చంద్రబాబు కుయుక్తులు పన్నారు. ఎలాగైనా నెగ్గాలని అడ్డదారులు తొక్కేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట టీడీపీ బస్సు యాత్రను నిర్వహిస్తోంది. సోమవారం నుంచి ఐదు రోజుల పాటు పల్నాడు జిల్లాలో ఈ యాత్ర సాగనుంది. గత ఎన్నికల్లో తనను తిరస్కరించిన ప్రజలను ఎలాగైనా నమ్మించడానికి చంద్రబాబు బస్సుయాత్ర ద్వారా మాయోపాయం పన్నారు. దీనిని గుర్తించిన ప్రజలు నిన్ను నమ్మం బాబూ అంటూ గళమెత్తుతున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో అమలు సంగతేంటని నాయకులను ప్రశ్నిస్తున్నారు.

2014 మేనిఫెస్టో కనిపించదే..!

2014 ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణ మాఫీ, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం వంటి సుమారు 600లకు పైచిలుకు హామీలను చంద్రబాబు ఇచ్చారు. మేనిఫెస్టోలోనూ పొందుపర్చారు. ఆనక గద్దెనెక్కాక తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీలలో కనీసం పది శాతం కూడా అమలు చేయలేదు. మేనిఫెస్టోనూ టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని మళ్లీ కొత్త మేనిఫెస్టోతో చంద్రబాబు వస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

పల్నాడుకు చేసిందేమిటి?

కొత్తగా ఏర్పడిన పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు.

- పల్నాడులో ఎంతో కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక ఆ ఊసే ఎత్తలేదు. పైపెచ్చు ఎన్నికలకు ఇంకా రెండు నెలలు ఉండగా 2019 ఫిబ్రవరిలో కేంద్రప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే టెండర్లు పిలిచి ప్రజలను ఏమార్చే యత్నం చేశారు.



- 2.17 లక్షల మంది రైతుల రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి మాట మార్చారు.
- పల్నాడు ప్రాంతంలో పత్తి, మిర్చి పంటల ఆధారిత పరిశ్రమలను నెలకొల్పుతామని చెప్పి ఆ దిశగా ప్రయత్నాలేవీ చేయలేదు.
- టూరిజం అభివృద్ధి హామీని అటకెక్కించారు.
- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో యువతను దారుణంగా మోసం చేశారు.
- వినుకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై ఏమాత్రం దృష్టిపెట్టలేదు.
- గురజాల, మాచర్ల ప్రాంతాల్లో సిమెంట్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయలేదు.

ఇప్పుడు హడావుడి

అధికారంలో ఉన్నప్పుడు వెనుకబడిన పల్నాడు అభివృద్ధికి ఏమీ చేయని తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే పల్నాడు రూపురేఖలు మార్చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. బస్సు యాత్ర పేరుతో ప్రజలను వంచించేందుకు యత్నిస్తున్నారు. దీంతో పల్నాడు వాసులు ఏ మొహం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

99శాతం హామీలు నెరవేర్చిన సీఎం జగన్

2019 ఎన్నికల్లో అద్భుత విజయంతో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించారు. అందులో ప్రస్తావించిన 99 శాతం హామీలను నెరవేర్చారు. జన జీవితాల్లో సంతోషాలు నింపారు. పల్నాడు అభివృద్ధికీ చిత్తశుద్ధితో కృషి చేశారు. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా పల్నాడు జిల్లాను ఏర్పాటు చేశారు.

- పల్నాడు ప్రజల ఏడు దశాబ్దాల కల అయిన వరికపూడిశెల ప్రాజెక్టు పనుల ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులూ తీసుకొచ్చారు. సుమారు రూ.1,273 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు పనులకు వచ్చే నెలలో సీఎం దివ్యహస్తాల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ పథకం వల్ల 73 వేల ఎకరాలకు సాగునీరు, 4.5 లక్షల మందికి తాగునీరు అందనుంది.



వరికపూడిశల ప్రాజెక్టు నిర్మించబోయే ప్రాంతం



పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో వేగంగా జరుగుతున్న మెడికల్ కళాశాల పనులు

- పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో 47.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో చేపట్టిన మెడికల్ కళాశాల పనులు వేగంగా జరుగుతున్నాయి. పూర్తయితే వంద ఎంబీబీఎస్ సీట్లు మంజూరు కానున్నాయి.
- పల్నాడు జిల్లా మీదుగా కొత్తగా ఐదు జాతీయ రహదారుల నిర్మాణం కొనసాగుతోంది. జిల్లాలో 43 భారీ, మెగా పరిశ్రమలను రూ.2,212 కోట్ల పెట్టుబడితో స్థాపించడంతో 15 వేల మందికి ఉపాధి లభించనుంది.
- జిల్లాలో రూ.1,524.4 కోట్లతో 399 గ్రామ, వార్డు సచివాలయాలు, రూ.69.98 కోట్లతో 321 ఆర్‌బీకేలు, రూ.53.9 కోట్లతో 308 వైఎస్సార్ క్లినిక్‌లు, రూ.13.54 కోట్లతో 86 బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, రూ.26.24 కోట్లతో164 డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. పనులు చివరి దశలో ఉన్నాయి.
- 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా జిల్లాలో 1,10,324 మందికి ఇళ్ల స్థలపట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందు కోసం రూ.286.94 కోట్లు ఖర్చుచేసి 2,853.18 ఎకరాల్లో 859 లేఅవుట్లను అభివృద్ధి చేసింది. జిల్లాలో తొలి దశలో సుమారు రూ.756.22 కోట్లు ఖర్చుచేసి 42,012 గృహాల నిర్మాణం చేపట్టింది. ఇంతలా తమ కోసం అహర్నిశలూ పాటుపడుతున్న సంక్షేమ సర్కారుపై ప్రజలు అమిత విశ్వాసం కనబరుస్తున్నారు. జగనన్నకు జేజేలు పలుకుతున్నారు.

గిరిజనుల పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 105 మంది గిరిజనులకు భూహక్కు పట్టాలు పంపిణీ



రాజుపాలెం: గిరిజనులు పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులయ్యేలా తీర్చిదిద్దాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఉప్పలపాడు శివారు చల్లాపల్లి తండాలో ఆదివారం సర్పంచ్ రామావతు మేరీబాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిరిజనులకు భూహక్కు పట్టాలను మంత్రి అందించారు. అనంతరం అంబటి మాట్లాడుతూ గిరిజనులకు భూమిపై హక్కు కల్పించేందుకు వైఎస్ రాజశేఖర రెడ్డి 2005లో చట్టం తీసుకొచ్చారని కొనియాడారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 588 మంది గిరిజనులకు 1,025 ఎకరాల భూమికి పట్టాలిచ్చినట్లు వివరించారు. చల్లాపల్లితండా, లక్ష్మీపురం తండాల గిరిజనులు 105 మందికి 145 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ జలజీవన్ మిషన్ ద్వారా రూ.38 లక్షలతో కుళాయి ఇస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ లోతోటి శివశంకర్ మాట్లాడుతూ శాటిలైట్ ద్వారా గిరిజనులు చేసే భూసాగును ముందుగానే ఫొటోలు తీస్తామని, వీటి ద్వారానే వారికి భూమిపై హక్కుపత్రాలు ఇస్తామని తెలిపారు. డీఎఫ్‌వో రామచంద్రరావు మాట్లాడుతూ 2013 వరకు అటవీ భూమిని సాగుచేసుకున్న రైతులకు మాత్రమే పట్టాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఆర్డీఓ రాజకుమారి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మద్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, డీటీడబ్ల్యూవో దుర్గాబాయ్, మాజీ సర్పంచ్ తుల సీ నాయక్, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)

మొత్తుకున్నా వినరా

- డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు
- మత్తు పదార్థ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా..
- అందుబాటులోకి టోల్‌ఫ్రీ నంబర్ 14500
- నేడు ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిగా నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఏపీని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు శ్రీకారం చుట్టింది. దీనికోసం యువత మేలుకో-భవితను మలుచుకో-డ్రగ్స్‌ను వదులుకో అనే నినాదంతో ముందుకెళుతోంది. ఉమ్మడి జిల్లాలోని పోలీసు అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేపట్టింది. మత్తు పదార్థాల వల్ల తలెత్తే దుష్పరిణామాలపై ఫొటోలతో కూడిన భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తోంది. విద్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అయినా కొందరు పెడదారి పడుతున్నారు. మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారు. కొందరు విక్రయాలూ చేపడుతున్నారు. మాదక ద్రవ్య నిర్మూలన మహాయజ్ఞంలో అధికారులతోపాటు తల్లిదండ్రులు, ప్రజలు భాగస్వాములు కావాలని పోలీసులు కోరుతున్నారు. సోమవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపడుతున్న చర్యలపై కథనం

శభాష్ 'సెబ్'

గంజాయి, డ్రగ్స్ కట్టడికి పోలీస్ శాఖ ఎస్ఈబీ (సెబ్) విభాగాన్ని ఏర్పాటు చేసింది. సెబ్ బృందాలు పోలీసులతో కలిసి జల్లెడ పడుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి మత్తుపదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాయి. భారీగా నిల్వలను, రవాణా వాహనాలను సీజ్ చేసి విక్రేతలతోపాటు కొనుగోలుదారులనూ అరెస్ట్ చేస్తున్నాయి. అనుమానితులనూ అదుపులోకి తీసుకుంటున్నాయి. పదేపదే డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నాయి. ఇంకా శ్రుతిమించితే పీడీ చట్టం ప్రయోగానికీ వెనుకాడడం లేదు. ఇటీవల గుంటూరు జిల్లాలో ఐదుగురిపై పోలీసులు పీడీ చట్టం ప్రయోగించారు. అందులో ఓ రౌడీషీటరూ ఉన్నాడు.

కట్టడికి ప్రత్యేక దృష్టి



జిల్లాలో 2021 నుంచి గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక దృష్టిసారించాం. సాధ్యమైనంతవరకు కట్టడి చేస్తున్నాం. పదేపదే మత్తుపదార్థాలతో పట్టుబడితే పీడీ చట్టం ప్రయోగానికీ వెనుకాడడం లేదు. ఈ మహాయజ్ఞంలో ప్రజలూ భాగస్వాములు కావాలి. డ్రగ్స్, గంజాయికి యువత బానిసలు కావద్దు. జీవితాలు నాశనం చేసుకోవద్దు

– ఆరిఫ్ హఫీజ్, ఎస్పీ, గుంటూరు

అవగాహన ఇలా..

పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న పోలీసులు వాటివల్ల కలిగే దుష్పరిణామాలను సోదాహరణంగా వివరిస్తున్నారు. మత్తు పదార్థాలతో పట్టుబడితే నమోదయ్యే కేసులు, సెక్షన్లు, శిక్షల గురించి అవగాహన కల్పిస్తున్నారు. బానిసలైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొస్తున్నారు. ప్రధాన కూడళ్లలో, రద్దీగా ఉండే ప్రదేశాల్లో, రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ భారీ హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు అమ్ముతున్నా.. కలిగి ఉన్నా.. టోల్ ఫ్రీ నంబర్ 14500కి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు.

మూడేళ్లుగా కేసుల వివరాలు ఇలా..

	2021	2022	2023 (జూన్ 24 వరకు)
కేసులు సంఖ్య	81	70	49
అరెస్టైన వారు	214	169	115
సీజ్ డ్రై గంజాయి (కిలోలు)	3,644.70	226.024	111.085
లిక్విడ్ గంజాయి (లీటర్లు)	3.610	2.258	0.422
సీజ్ చేసిన వాహనాలు	30	14	13

(2021 నుంచి ఇప్పటివరకు ఎల్ఎస్‌డీ-58, ఎండీఎంఏ 8.14 గ్రాములు, నార్కోటిక్ ఎం డ్రగ్ 21.49 గ్రాములు, ట్రామడోల్ ఎండీ డ్రగ్ 17.1 గ్రాములు, మాత్రలు 25 పోలీసులకు పట్టుబడ్డాయి.)

వ్యసనాలకు బానిసలై.. గంజాయి అమ్ముతూ..

- పట్టుబడిన నలుగురు యువకులు
- అంతా 22 ఏళ్ల లోపువారే..



కేసు వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ చిత్రంలో జిల్లా పోలీసు అధికారులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వ్యసనాలకు బానిసలై గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను తెనాలి ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.62,500 ఖరీదు చేసే 1.250 కిలోల గంజాయి, ఒక మోటారుసైకిల్‌ను సీజ్ చేశారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ వెల్లడించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈనెల 24న సాయంత్రం తెనాలి రామలింగేశ్వర పేటలోని పాత ఆర్టీసీ డిపో కూడలి వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా నలుగురు యువకులను కనిపించారు. వారిని తెనాలి టౌన్ చిన్నరావూరు రైల్వేస్టేషన్ రోడ్ వాసి పోతర్లంక కిరణ్ అలియాస్ సాయికిరణ్, మారీసుపేట గంగమ్మతల్లీ గుడి దగ్గర్లో ఉంటున్న మోపిదేవి వెంకటసాయి అలియాస్ సన్నీ, నందులపేటకు చెందిన నీలం లీలాసాయితేజ, చిన్నరావూరు ఎంటీ నగర్ వాసి గొట్టిపాటి అక్షయ్‌గా పోలీసులు గుర్తించి గంజాయి అమ్ముతున్నట్టు రూఢీ చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.62,500 విలువ చేసే 1.250 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈజీగా డబ్బు సంపాదించాలనే..

నలుగురిలో కీలకమైన సాయికిరణ్ ఐదారు నెలలుగా అరకు వ్యాలీ వెళ్లి గంజాయి తీసుకొస్తున్నాడు. నలుగురికీ గంజాయి తాగే అలవాటు ఉంది. దీనికితోడు వ్యవసనాలకు బానిసలై ఈజీగా డబ్బు సంపాదించాలని భావించారు. దీంతో తెచ్చిన గంజాయిలో కొంత తాగి మిగతాది అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అందరూ 22ఏళ్ల లోపువారే కావడం గమనార్హం. సాయికిరణ్ హోటల్ మేనేజ్‌మెంట్ చదవగా, లీలాసాయితేజ ఓ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇక వెంకటసాయి ఇంటర్, అక్షయ్ పదో తరగతి పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నారు. అక్షయ్‌పై గతంలో ఒక కొట్లాట కేసు ఉండగా, మిగతా ముగ్గురిపై కేసులు లేవు. ఇదిలా ఉంటే ఈనెల 23న సాయికిరణ్, వెంకటసాయి, మరో వ్యక్తి సుభాష్ కలిసి మున్సిపల్ మార్కెట్ సమీపంలో నిలిపిన మోటారుసైకిల్ చోరీ చేశారు.

ఇకనైనా గంజాయికి స్వస్తి పలకాలి

డ్రగ్స్, గంజాయి క్రయవిక్రయాలు చేసే వారు ఇకనైనా వాటికి స్వస్తిచెప్పాలని ఎస్పీ స్పష్టం చేశారు. లేకుంటే రౌడీషీట్, పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని, ఇప్పటికే పలువురిపై పీడీ చట్టం ప్రయోగించి, జైలుకు పంపించామని గుర్తుచేశారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ (ఎల్/ఓ) కె.శ్రీనివాసరావు, డీఎస్పీలు బి.జనార్దనరావు (తెనాలి), శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), తెనాలి ఒకటో పట్టణ పీఎస్ సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, ఏఎస్ఐ కె.రత్న రాజు, హెచ్‌సీ కె.వెంకటేష్, కానిస్టేబుళ్లు కె.బాబురావు, ఎన్.శ్రీనివాసరావు, షేక్.ఎండీకే షరీఫ్ పాల్గొన్నారు.

భక్తజన సందడి



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమ్మవారి లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

ఇంద్రకీలాద్రిపై మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తజనంతో ఇంద్రకీలాద్రిపై సందడి నెలకొంది. దుర్గామల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. సాధారణ భక్తులతోపాటు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించడానికి విచ్చేసిన వారితో పండుగ వాతావరణం కనిపించింది. ఖడ్గమాలార్చన, ఉదయం నిర్వహించే లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో రద్దీ మరింత పెరిగింది. భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ ఈఓ భ్రమరాంబ చర్యలు తీసుకున్నారు. సారె సమర్పించిన భక్తులను రూ.300 టికెట్ క్యూలైన్‌లోకి అనుమతించారు. రూ.100 టికెట్ తీసుకున్న భక్తులకు ముఖ మండప దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలో పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండుపూటలా పాఠశాలలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని పాఠశాలలు సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కొనసాగనున్నాయి. ఈనెల 12న పాఠశాలలు పున: ప్రారంభమైన తరువాత ఎండ తీవ్రత నేపథ్యంలో ఈనెల 24 వరకు ఒక్కపూటే తరగతులను నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో సోమవారం నుంచి రెండు పూటలా తరగతులను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతి ఆదివారం ఉత్తర్వులిచ్చారు.

3న పౌర్ణమి గిరి ప్రదక్షిణ

విజయవాడ: ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని జూలై 3వ తేదీ సోమవారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. సోమవారం ఉదయం దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. సుమారు 7 కిలోమీటర్ల మేర జరుగుతుందని, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారని తెలిపారు. దేవస్థాన ప్రచార రథాన్ని ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆట్యా- పాట్యా జిల్లా జట్ల ఎంపిక



ఆట్యా-పాట్యా ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన బాలబాలికలు

నరసరావుపేట రూరల్: ఆట్యా- పాట్యా ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. 85మంది పోటీలకు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ చూపిన ఆటగాళ్లను జట్లకు ఎంపిక చేశారు. జూలై 1,2 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా తునిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సీతారావమ్మ తెలిపారు. ఎంపిక పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి పర్యవేక్షించారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా జీ ఝాన్సీరాణీ, సిహెచ్.పుల్లయ్య, పి.తిరుపతిరావు, బి.తిరుమలబాయి, డి.సుబ్బారావు, బి.పెదవెంకటేశ్వర్లు వ్యవహరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.ఉమాదేవి, వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.శ్రీరామిరెడ్డి, ఎస్కే సుభాని, ఎస్కే రియాజ్, పి.శ్రీనివాసరెడ్డి, అచ్చిరెడ్డి, ఏ చిన్నయ్య పాల్గొన్నారు.

బాలుర జట్టు..

పి.వరప్రసాద్, టి.మణిదీప్, సిహెచ్ ప్రశాంత్, పి.తివిక్రం, ఎం.శివసాయిశ్రీకర్, ఎ.మోజేష్, కె.ప్రశాంత్, వై.మ్యాక్సీ(శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్), కె.శ్రీనివాస్, ఎం.సాయి ప్రదీప్, ఎస్‌కె.ఇస్మాయిల్, సిహెచ్. సాయిచరణ్, టి.వెంకట్ అశోక్ (ఎస్‌వీవీఆర్ హైస్కూల్, నకరికల్లు), ఎస్‌కేఎండీ రఫీ(జెడ్పీ హైస్కూల్, కావూరు)

బాలికల జట్టు..

బి.సౌజన్య, డి.రంగమహలక్ష్మి, టి.చంద్రిక, బి.హరిణి, కె.లోహిత, పి.రాజశ్రీ, సిహెచ్. సిరిసాత్విక (శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్), ఎన్.శ్రీనిజ, జి.సాధిక, బి.గాయత్రీ, టి.లిఖితశ్రావ్య, ఎం.అనిత (ఎస్‌వివిఆర్ హైస్కూల్, నకరికల్లు), ఎం.హేమగాయత్రీ, కె.త్రివేణి,(జెడ్పీ హైస్కూల్, కావూరు).

సర్ధార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శం

- సినీనటుడు సుమన్
- పెదకాకానిలో సర్ధార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ



పెదకాకాని సెంటర్‌లో సర్ధార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు సుమన్, గౌతు శిరీష, గౌడ సంఘ నాయకులు

పెదకాకాని: నేటి యువత సర్ధార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయమని సినీ నటుడు తల్వార్ సుమన్ అన్నారు. పెదకాకాని ప్రధాన సెంటర్‌లో ఆదివారం స్వాతంత్య్ర సమరయోధుడు సర్ధార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ, బహిరంగసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సినీ నటుడు సుమన్, గౌతు శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రముఖ న్యాయవాది కారంకి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సుమన్ మట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో పోరాటాలు చేసిన మహనీయులను గుర్తుంచుకోవడం మన కర్తవ్యంగా భావించాలని చెప్పారు. 35 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, మంత్రిగా నిబద్ధతతో సేవలందించిన మహనీయుడు సర్ధార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు. సమస్యలు ఎదురైనపుడు, ఇబ్బందులు వచ్చినపుడు ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీల నాయకులు ఓటు వేసిన బీసీలను గుర్తించాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో బీసీల అభ్యున్నతికి ఏం చేయబోతున్నారో చెప్పాలని కోరారు. గౌతు లచ్చన్న మనుమరాలు గౌతు శిరీష మాట్లాడుతూ పదవులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యలపై ప్రశ్నించడానికి ఇష్టపడే వ్యక్తి సర్ధార్ గౌతు లచ్చన్న అన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడిగా తెల్లదొరలతో పోరాటాలు చేసిన ఆయన స్వాతంత్య్రం వచ్చిన తరువాత బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. గౌడ జాతికి ఏ అవసరం వచ్చినా లచ్చన్న మనుమరాలిగా పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా తోడు నడుస్తానని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, చేతి వృత్తుల వారి కోసం 1930వ సంవత్సరంలో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ సుమారు 1000 కిలోమీటర్లు గౌతు లచ్చన్న పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ర్యాలీగా పెదకాకాని చేరుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ గౌడ్, జోగి నాగేశ్వరరావు, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈవీ నారాయణ, చెన్ను విజయలక్ష్మి, పోసిన చెంచురామారావు, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, శ్యాంముఖర్జీబాబు, ఉప సర్పంచి వలివేటి మురళీకృష్ణ, వాకా రాంగోపాల్‌గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు వీరంకి రంగారావు, ఉప్పాల శివాజీ, క్రోసూరి పూర్ణచందరరావు, కుక్కల రాంప్రసాద్, చింతా శంభునాథ్, విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడిపై చీటింగ్ కేసు

నరసరావుపేట టౌన్: ఆర్యవైశ్య ప్రముఖుడు బొల్లిశెట్టి వెంకటేష్‌పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. కోర్టు జప్తు చేసిన ఆస్తిని మరొకరికి విక్రయించిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. వన టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాష్ నగర్‌కు చెందిన ఏలూరి ప్రసాద్ వద్ద బొలిశెట్టి వెంకటేష్ రూ.2.60 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. నగదు తిరిగి చెల్లించక పోవటంతో ప్రసాద్ కోర్టును ఆశ్రయించాడు. రాసిచ్చిన ప్రామిసరీ నోట్ల ఆధారంగా 2021లో వెంకటేష్ ఆస్తులను కోర్టు అటాచ్ చేసింది. విషయాన్ని దాచిపెట్టి ఆస్తిని వెంకటేష్ మరొకరికి విక్రయించాడు. దీనిపై ప్రశ్నించినందుకు తన అనుచరులతో ప్రసాద్‌పై బెదిరింపులకు దిగాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

టూటౌన్‌లో మరో కేసు..

తన సంతకం ఫోర్జరీ చేసి రూ.40 లక్షలు డ్రా చేశారని ప్రముఖ వైద్యుడు చింతా రామకృష్ణ భార్య చింతా వాసవి ఇచ్చిన ఫిర్యాదుతో బొలిశెట్టి వెంకటేష్, చింతా కిరణ్‌లపై చీటింగ్ కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పల్నాడు బస్టాండ్‌లోని విజయ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్‌కు చింతా వాసవి ప్రొప్రైటర్‌గా వ్యవహరిస్తోంది. పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమె మరిది కిరణ్, అతని స్నేహితుడు బొల్లిశెట్టి వెంకటేష్ కలసి కార్యాలయంలో ఉన్న చెక్ బుక్‌ను కాజేశారు. ఆ తర్వాత ఫోర్జరీ సంతకం సృష్టించి నగదు డ్రా చేశారు. ఈ వ్యవహారంపై బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో ఈ నెల 17న టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, కార్యదర్శిగా వై.వి.సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్ ఆవరణలో ఆదివారం అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ చైర్మన్‌గా కపలవాయి విజయకుమార్, ప్రధాన పోషకునిగా సి.అరవిందబాబు, కోశాధికారిగా వై.వి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఐ.సాంబశివరావు, ఎం.అచ్చయ్య, కె.హిందుజా, జాయింట్ సెక్రటరీలుగా పి.గిరిబాబు, యు.సురేష్‌రెడ్డి, బి.కీర్తిరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఏసీఏఏఏ కోశాధికారి ఐ.రమేష్, డీఎస్ఏ చీఫ్ కోచ్ పి.అఫ్రోజ్‌ఖాన్, రిటర్నింగ్ అధికారిగా న్యాయవాది వై.శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

జిల్లాలో అత్యధిక వర్షపాతం

నరసరావుపేట: జిల్లాలోని 11 మండలాల్లో ఆదివారం నాటికి అధిక వర్షపాతం నమోదైంది. దాచేపల్లిలో ఈనెల సాధారణ వర్షపాతం 69.4 మిల్లీమీటర్లు కాగా 73.8 మి.మీ. వర్షం కురిసింది. అలాగే మాచవరం 51.5-103.0 మి.మీ, పెదకూరపాడు 94.6-96.6, సత్తెనపల్లి 94-192.4, నకరికల్లు 84.3-124.6, వినుకొండ 60.3-87.4, నరసరావుపేట 82.1-95.2, ముప్పాళ్ల 92.3-104.2, నాదెండ్ల 78.4-137.8, చిలకలూరిపేట 75.7-145.8, యడ్లపాడు 88.6-152.4 మి.మీ కురిసింది. సగటు వర్షపాతం 80.9 మి.మీ కాగా 80.4 మి.మీ వర్షం నమోదైంది.

ఉద్యోగోన్నతులతో ఖాళీలను భర్తీ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల అనంతరం ఏర్పడిన ఖాళీలను ఉద్యోగోన్నతులతో భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల తరువాత పల్నాడు జిల్లాలో వందలాది స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నాయని తెలిపారు. ఫలితంగా ఉపాధ్యాయుల కొరతతో విద్యాబోధనకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల నియామకాలతో ప్రాథమిక పాఠశాల్లో ఇబ్బందులు తొలిగిపోయాయని, హైస్కూళ్లలో అవసరమైన స్థాయిలో ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతులతో నియమించాలని కోరారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

పాత గుంటూరు: రాష్ట్రంలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు కోరారు. ఆదివారం బ్రాడీపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి విడుదల చేసిన నిధులను పంచాయతీలకు కేటాయించాలని కోరారు. పంచాయతీల నిధులను జూలై 3వ తేదీ లోపు విడుదల చేయాలని లేనిపక్షంలో 3న తాడేపల్లిలోని కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మోహన్, జిల్లా అధ్యక్షుడు ముప్పాల మనోహర్, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

నమ్మకంతో చదివితే ఏదైనా సాధ్యమే..



ఉత్తమ విద్యార్థికి బంగారు పతకం అందజేస్తున్న పూనం మాల కొండయ్య

పిట్టలవానిపాలెం: విద్యార్థి తనపై తాను నమ్మకంతో చదువుకున్నప్పుడు ఏదైనా సాధించగలడని సీఎంవో స్పెషల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి తనను తాను గౌరవించుకుంటూ తల్లదండ్రులు, ప్రకృతిని కూడా గౌరవించాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ నరసరాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రకాల నైపుణ్యాల్ని సాధించాలని చెప్పారు. ఐదు వేల మందికి కంప్యూటర్ నైపుణ్యాన్ని అందించేందుకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాల ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన చిరంజీవి, ఈశ్వరసాయి, కుమారి, పఠాన్, హఫీజున్నీసాలకు బంగారు పతకాల్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ వెంకట శివరామరాజు, మాజీ ప్రెసిడెంట్ పెనుమత్స వెంకటేశ్వరరాజు, జాయింట్ సెక్రెటరీ మంతెన కృష్ణంరాజు, మాజీ సెక్రెటరీ ఎం.రామరాజు, ట్రెజరర్ సుబ్బరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


27న 'కాళ్లకూరి' రచనలపై విశ్లేషణ



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన డాక్టర్ సాయిమాధవ్ బుర్రా

తెనాలి: మహాకవి కాళ్లకూరి నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఈనెల 27వ తేదీన ఆయన రచించిన ప్రసిద్ధ నాటకాలపై సాహితీ విశ్లేషణ, ఆయన రచించిన 'వరవిక్రయం' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా తెలిపారు. కళల కాణాచి, తెనాలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికను ఆదివారం ఇక్కడి గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. కాళ్లకూరి రచించిన మధుసేవ, వరవిక్రయం, చింతామణి వంటి సుప్రసిద్ధ నాటకాలు ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో నాటక సమాజాలు ప్రదర్శిస్తున్నాయని గుర్తుచేశారు. నేటితరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు ఉదయం 10.15 గంటలకు ఏర్పాటయే సభలో 'కాళ్లకూరి నారాయణరావు నాటకేతర సాహిత్యం'పై డాక్టర్ వాడ్రేవు సుందరరావు, మధుసేవ నాటకంపై జోస్యుల కృష్ణబాబు, చింతామణి నాటకంపై పిన్నమనేని మృత్యుంజయరావు, వరవిక్రయం నాటకంపై డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు ప్రసంగిస్తారని తెలిపారు. ప్రముఖ సినీనిర్మాత, టీటీడీ పాలకమండలి సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరించారు. సాయంత్రం 6.30 గంటలకు సుమిత్ర యూత్ అసోసియేషన్, మధిర వారిచే 'వరవిక్రయం' పద్యనాటకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కాళ్లకూరి రచించిన నాటకాన్ని డాక్టర్ నిబానుపూడి సుబ్బరాజు దర్శకత్వంలో ప్రదర్శిస్తారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, గోగినేని కేశవరావు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, కొండముది రమేష్‌బాబు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థినికి జాతీయస్థాయి అవార్డు



తాడేపల్లిరూరల్ : ఈనెల 16 నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థిని జాతీయ స్థాయి అవార్డును సాధించిందని యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన జె.షణ్ముఖి గత పదిరోజులుగా విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయిలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి అవార్డును అందుకుందని తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి ఆర్.సుభాకర్ రాజు, 25వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కల్నల్ ఎస్.సిద్ధు, సుబేదార్ మేజర్ విజయ్ మోహిత్, తదితరులు షణ్ముఖిని అభినందించారు.

కన్నపేగుపైనా కనికరం లేకుండా...

పొలాల్లో పసికందు మృతదేహం



మాచవరం: మానవత్వం మంటకలిసింది. ఎన్నో ఆశలతో అమ్మఒడిలో ఒదిగిపోదామనుకున్న చిట్టితల్లి కళ్లు తెరవక ముందే కటికి పంపారు. ఈ ఘటన మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామ శివారు పొలాల్లో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.కోటయ్య తెలిపిన వివరాలు.. గ్రామ శివారు పొలాల్లో పరిసర పొలాల రైతులు ఓ పసిపాప మృతదేహం పడి ఉండడాన్ని గమనించారు. దగ్గరకు వెళ్లి చూడగా ముక్కు పచ్చలారని పసికందు మృతి చెంది ఉండడంతో చలించిపోయారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతి చెందిన పాప వయస్సు సుమారుగా ఏడు రోజులు ఉంటుందని, పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కారు ఢీకొని ఒకరు మృతి



నాగమల్లేశ్వరరావు మృతదేహం

అచ్చంపేట: రోడ్డు పక్కనే కూర్చున్న వ్యక్తిపై అతి వేగంగా కారువచ్చి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి ఎంట్రన్స్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. కొత్తపల్లికి చెందిన మోదుగుల నాగమల్లేశ్వరరావు(53) సాయంత్రం 5గంటల సమయంలో గ్రామ ప్రవేశంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న రాతిరోలుపై కూర్చున్నాడు. మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమ్మగుడి నుంచి అతివేగంగా వచ్చిన కారు కూర్చున్న వ్యక్తిని ఢీకొట్టడంతో నాగమల్లేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు రెండు పల్టీలు కొట్టి దూరంగా పడింది. మృతుడికి భార్య మల్లేశ్వరి, ముగ్గురు ఆడపిల్లలు, ఒక్కరూ మగ సంతానం ఉన్నారు. కారు డ్రైవరు, అందులో ప్రయాణిస్తున్న వారు పరారయ్యారు. అయితే కారు సత్తెనపల్లి మండలం, పెదమక్కెన గ్రామానికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఇన్‌చార్జి ఎస్ఐ కె.పాల్ రవీంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

టీ స్టాల్‌లో చోరీకి యత్నించి..



టీస్టాల్‌లో మణికంఠ మృతదేహం

నరసరావుపేట రూరల్: టీ స్టాల్‌లో చోరీకి యత్నించిన 14 ఏళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన లింగంగుంట్ల ప్రభుత్వ వైద్యశాల ఎదురు చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపిన వివరాలు.. టీ స్టాల్ నిర్వాహకులు శనివారం రాత్రి యథావిధిగా తమ షాపుకు తాళాలు వేసి వెళ్లారు. తిరిగి ఆదివారం వచ్చి చూడగా ఓ బాలుడు మృతిచెంది ఉండటాన్ని గమనించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన దర్శిగుంట మణికంఠ(14)గా నిర్ధారించారు. టీస్టాల్ వెనుకవైపు నుంచి చోరీ కోసం లోపలికి ప్రవేశించి విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లుగా నిర్ధారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



నెహ్రూనగర్: నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ మెండెం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్‌లో రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక అన్ని జిల్లాల ముఖ్య నాయకుల సమక్షంలో జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఫణి ప్రకాష్, కోశాధికారి ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా పి గోవర్ధన్, జయశంకర్, అధికార ప్రతినిధిగా పాండురంగ నాయకస్వామి, జాయింట్ సెక్రటరీగా అనిల్‌కుమార్, న్యాయ సలహాదారుగా అంజయ్యలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకొకసారి ఎన్నిక ఉంటుందన్నారు. ఈ ఎన్నికలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందన్నారు. దాసు సంఘీయుల సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తానన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా ముగిసిన ఎన్‌సీసీ క్యాంపు



విజ్ఞాన్ యూనివర్సిటీలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో ఎన్‌సీసీ క్యాంపు అధికారులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఐదు రాష్ట్రాల నుంచి ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ ఎన్‌సీసీ శిబిరం నిర్వహణలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌ల నుంచి హాజరైన 600మంది ఎన్‌సీసీ విద్యార్థులకు 12 రోజుల పాటు సాంస్కృతిక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్, క్యాంపు కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ 12 రోజుల క్యాంపులో భాగంగా విద్యార్థులతో కొండవీడు కోటకు వెళ్లి ట్రెజర్ హంట్ కండక్ట్ చేశామన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడి, ఉండవల్లి గుహలు, అమరావతి బుద్ధ విగ్రహం, మ్యూజియం, సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లను సందర్శించామన్నారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం అలవడడంతోపాటు సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో నేర్చుకుంటారని తెలియజేశారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, సీఏస్ సిద్ధు తదితరులు పాల్గొన్నారు.